

# శివపూజ

నేనూ శివుడు స్నేహితులం!

బొడ్డు కోసినపుడు వాడికి పెట్టిన పేరు శివకుమార్!—ఆ తరువాత యింట్లో వాళ్ళు ఆ పేరు నే రెండుగా కోసి రెండవ భాగాన్ని మాత్రం వదలి పెట్టి మొదటి భాగానికి ఆప్యాయతను, అనురాగాన్ని రంగలించి 'శివా!' అని ముద్దుగా పిలుచుకొనేవారు. కానీ నేను మాత్రం 'శివుడూ!' అంటుంటాను.

శివుడు నేనూ ఒక కంచములో తినలేదు. ఒక మంచములో పడుకో లేదు. ఒక బడిలో చదువుకోలేదు. ఒకచోట కలిసి ఆడుకోలేదు.

అయినా మేము స్నేహితులం!

ఏది వుండి యేది లేకున్నా కనీసం వయస్సులు లేదా అభిప్రాయా లైనా కలిస్తే—సాధారణంగా స్నేహం కలవడానికి అవకాశా లెక్కువ. అవయినా వున్నాయా?—అంటే, అవీ లేవు. నా బ్రదుకులో పొద్దువాలితే వాడి బ్రదుకులో పొద్దు మొలిచి యిప్పుడిప్పుడే బారెడెక్కింది. ఇక అభి

ప్రాయాలందామా?—ఊరు చూడమంటే ఉత్తరం చూస్తుంటాయి. ఉప్పును నిప్పును మతికి తెస్తుంటాయి.

అయినా మేము స్నేహితులం!

ఇది భిన్నత్వంలో ఏకత్వం!

దీనిని పూర్వజన్మ సుకృతమంటాను నేను. 'పూర్వజన్మము.... సుకృతము....గాడిద గుడ్డూ—యేవీ లేవు. ఇది కేవలం శాస్త్రం. వ్యతిరేక ధృవాలు ఆకర్షింపబడుతాయి. ఇది సహజం'—అంటాడు శివుడు. అది పూర్వజన్మ సుకృత ఫలమో? వ్యతిరేక ధృవాల ఆకర్షణ శాస్త్రమో? తెలియదు కానీ—

మేము మాత్రం స్నేహితులం!

ఆరేడు సంవత్సరాల క్రిందటి మాట. అర్ష సదస్సునుండి శ్రావ్యమైన గాత్రం భక్తి గీతాన్ని ఆలాపిస్తూ వుంది. ఆ మధురిమలు కొండల్లో కోనల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. అనుభవిస్తూ నడుస్తున్న నా దృష్టిని ఓ కుర్రవాడు ఆకర్షించాడు.

పదహారు లేక పదిహేడేండ్లుంటాయి. ఓ పొట్టి నిక్కరు, చొక్కా తొడుక్కొన్నాడు. ఓ రావిచెట్టు క్రింద కూర్చుని ఆ బోదెకు చేరగిలబడి ఎటో చూస్తున్నాడు. ఆ బుల్లోడి వైఖరి గమనిస్తూంటే ఎవరో ఆరితేరిన వృద్ధుడు తీరుబాటుగా కూర్చుని జీవిత సత్యాన్వేషణలో మునిగి తేలుతున్నాడా? అనిపిస్తూ వుంది. చూడ ముచ్చటగొలుపుతున్నాడు. నిలబడి కాసేపు నిదానించి చూశాను. ఆశ్చర్యం!—నేనూ చిన్నప్పుడు అలానే వుండి వుంటానేమో? అన్న భావన మనసులో మెదిలింది. మనసు మరింత దగ్గరయింది. దగ్గరికి వెళ్ళాను. ఆ దారి వెంబడి ఎందరో వస్తున్నారు, పోతున్నారు. ఎవరికీ, ఏమీ, పట్టనట్లుగా ఎవరి దారి వారిదిగా వుంటే—నేను ప్రత్యేకించి ఆ కుర్రవాడి దగ్గర చేరానన్న భావనతోనేమో, ఎగిరిపడి లేచాడు. రెండు చేతులు జోడించి నమస్కరించాడు.

వినయశీలత వినమ్రుణ్ణి చేసింది.

"ఏ వూరు బాబూ?"

"తిరుపతి."

"ఏం చదువుతున్నావు?"

"పదవ తరగతి పాసయ్యాను."

"ఇక్కడ యిలా ఒంటరిగా కూర్చున్నావెందుకు?"—అలాంటి సమయాల్లో అలాంటి చోటుల్లో సరదాగా ఎవరైన కూర్చోవచ్చు. కానీ ఆ కుర్రవాడి వైఖరిలో ఏదో నిస్సహాయత కొట్టవచ్చినట్లు కనుపిస్తూంటే అడుగుదామని అడిగాను. ఒకసారి నావైపు చూశాడు దీనంగా. మళ్ళీ తల వాల్చుకొన్నాడు మౌనంగా!

"ఏం జరిగింది చెప్పు బాబూ!" ఆప్యాయత ఉట్టిపడేలా అడిగాను.

మళ్ళీ ఒకసారి తలెత్తి చూశాడు. కళ్ళనిండుకు నీళ్ళు!—ప్రయత్న పూర్వకంగా ఆపుకొంటున్నట్లుంది. నా మనసు ద్రవించింది. మరింత దగ్గరయ్యాను. భుజం తడుతూ బుజ్జగిస్తూ అడిగాను మళ్ళీ—ఏం జరిగిందో చెప్పమని!

"గుళ్ళో ఎవరో జేబు కొట్టేశారు సార్!" చాల బాధగా అన్నాడు.

"ఓస్! అంతేనా!" నేను తేలికగా నవ్వేశాను.

ఆ కుర్రవాడు వింతగా చూస్తున్నాడు నా వైపు.

"ఏం బాబూ! అలా వింతగా చూస్తున్నావు?"

"జేబులు కొట్టడమంటే మీకు నవ్వులాటగా వుందని!"

"జేబులు కొట్టడం, బ్రదుకులు కొట్టడం, తలలు కొట్టడం—కొందరి అవసరానికీ, మరి కొందరి ఆనందానికి తమ్ముడూ!.... ఈ వయస్సుకే ఇంత ఆలోచనలో పడితే యెలా?"

"అదిగాదు సార్! ఈ అడవుల్లో పులులు, సింహాలుంటాయి. అవి నోరులేని జంతువులు. అవి ఆహారంకోసమో, ఆనందం కోసమో, యితర

జంతువుల్ని చంపుతాయి కానీ, స్వజాతిని మాత్రం తాకడం లేదు. మరి మనిషి మనస్సుండి కూడా సాటిమనిషి నెత్తిమీదనే చెయ్యి బెట్టి తున్నాడే?''—

ఆ లేతహృదయములో పుట్టిన భావమో, లేక యే మహా కవి అభిప్రాయమో?- తెలియదు. అవసరంలేదు. కానీ ఆలోచనా విధానానికి ముగ్ధుడి నయ్యాను.

ఆనాటి నుండి నేనూ శివుడు స్నేహితులం!

నా అభిప్రాయాలు వాడికి నచ్చవు. ఉపన్యాసాలమీద అసలు అభిప్రాయమే వుండదు. అయినా వాడు నన్ను 'గురువుగారూ!' అని సంబోధిస్తాడు.

ఆకాశంబుననుండి శంభుని శిరంబందుండి....అన్నట్లుగా ఆకాశమంత ఎత్తులో వుండిన ఈ గురుశబ్దము భూలోకంలో పడి, అటుపై చిత్రసీమలో స్వైరవిహారంచేసి ఆ తరువాత బస్సుస్టాండులను ఆశ్రయించి అక్కడకూడా తల దాచుకోలేక పాతాళములో పడిపోయిన ఈ రోజుల్లో 'గురుశబ్దము' వెక్కిరింతగా వినిపిస్తుంది—ఎవరైనా పలుకుతూంటే! అయితే శివుడి నోట్లో అలాగాదు. అది పరిమితము. మృదుమధురము. 'గురువుగారూ!' అని పిలుస్తూంటే ఎంతో యింపుగా వుండి మరలా పిలిపించుకోవాలనిపిస్తుంది. అయితే అదే కుదరదు.

శివుడు చదువుకొంటున్నాడు. శివుడు తింటున్నాడు. శివుడు నిద్రపోతున్నాడు. శివుడే కాదు—దాదాపు వాడి వయసులో వున్నవారందరూ అదే పని చేస్తుంటారు. అయితే తీరికవేళల్లో వాడి వయసు కుర్రవాళ్ళు బజార్లమీద పడుతున్నారు. సినిమా హాళ్ళమీద దాడి చేస్తున్నారు. గుళ్ళల్లో గుంపు చేరుతున్నారు. అవసరానవసరాలమాట అటుంచి రంపుచేస్తున్నారు. అందమైన అమ్మాయిలు కంటపడితే అందమైన మాటలు గాలిపరం చేస్తున్నారు. కళ్ళతో అందాన్ని తాగేయాలని తపనపడుతున్నారు. అది వాళ్ళ

తప్పుగాదు. వయస్సులు అలాంటివి. అయితే శివుడు మాత్రం తీరిక దొరికితే చాలు నాతో కలసి తిరుగుతాడు. మేము కలిసి తిరుగుతూంటే లోకం మాతో కలిసి తిరుగుతుంది. ఊరకే తిరిగినా పరవాలేదు. నోరు పారేసుకొంటుంది. లోకం నోరు పారేస్తుంటే శివుడు నోరు చప్పరిస్తాడు. దాని తీరే అంత—అంటాడు.

అంత చిన్న వయస్సులోని వాడి వైఖరికి అబ్బురపడి అటుపై ఆలోచనలో పడి తరువాత అసూయపడడమే నా వంతు!

ఆ రోజు ఆదివారం. నిద్ర లేస్తూనే నేను పూర్తిచేయాలనుకొన్న రచన 'హీరో కృష్ణ'గారి ఏకపాత్రాభినయం. పాపం కృష్ణ నాలుగైదు వారాలనుండి ఎదుటపడినప్పుడంతా నిలదీసి అడక్కపోయినా అడిగినంత పని చేస్తున్నాడు. ఎక్కడో పోటీలట! నగదు బహుమతి మరీ పెద్ద మొత్తములో వుందట!—

"చూడండి సార్! ఎన్నో పరిషత్తులో పాల్గొన్నాను. ఎన్నో బహుమతులు లభించాయి. ఈ వెండి పైకప్పు కప్పులమీద మోజు తీరిపోయింది. దీనిని గ్రహించునట్లున్నారు పరిషత్తు నిర్వాహకులు. ఏదో డబ్బు మోజు చూపుతున్నారు. అదీగాక నా బదుకును మీలాంటి రచయితల చేతుల్లో పెట్టి ఏకపాత్రాభినయంగా ఆడి ఆశ తీర్చుకోవాలన్న తపన సార్ తపన!"—అంటూ అదో రకంగా పెడతాడు మొగాన్ని. అది చూస్తే 'అయ్యో! పాపం!' అనిపిస్తుంది. అందుకే అప్పటికే నాలుగైదు వారాలుగ వాయిదా పడిన రచన పూర్తిచేసి కానీ పైకి లేవగూడదనుకొన్నాను. అయితే ఎక్కడ ఎలా ఆరంభించి ఎలా ముగించాలో తోచక తికమకలు పడుతున్నాను.

"ఏం రాతలో తలరాతలు! ఆదివారం పూటయినా ఓ సినిమానా? పాడా? ఈ బతుక్కి ఓ పండగా పబ్బమా?....నేనూ చూస్తుండా ఈ ఇంట్లో అడుగుపెట్టింది మొదలు, అంత మంచి మొగానికి అర్ధసేరు పసుపా? అన్నట్లు సాగుతూంది నా బతుకు!"—

అయిదురోజుల క్రితం జ్వరం తగిలి మంచంమీద పడివున్న ఆరవ అమ్మాయికి జావకాయడానికి నూకవిసురుతూ శ్రీమతి ఒక్కొక్క మాటగా విసురుతూ వుంది. మంచంమీద అమ్మాయి మూలుగుతూ వుంది. కడగొట్టు నలుసు దేకుతూ దేకుతూ తల్లి ఒడివరకు దేకి ఆపై రవికముడికై వెదకి, 'ఛళ్ళు'న చెంపదెబ్బ తిని ఆరున్నొక్క రాగాన్ని అందంగా ఆలాపిస్తున్నాడు. 'హీరో కృష్ణ' నన్ను వేధిస్తున్నాడు. కొంపలో జీవుల వేదన. నాలో జీవుని వేదన. ఈ వాతావరణాన్ని వదలి నిరుపహతి స్థలానికై అన్వేషణ సాగిద్దామంటే—వీళ్ళకంటే చురుగ్గా వున్నాడు సూర్యుడు. గుడికంటే యిల్లే భద్రం ఈ రోజుల్లో. చతికిలబడి ఆ మీద కాగితం మీద పడ్డాను.

ఎంతసేపు గడిచిందో తెలియదు. మంచంమీద మూలుగుతున్న అమ్మాయి మగత నిద్రలో వుంది. ఆ ప్రక్కనే కూర్చుని మంచంకోడుకు తల ఆనించి శ్రీమతి చిన్న కునుకు తీస్తూ వుంది. చెంపదెబ్బతిన్న చంటివాడు యేడ్చియేడ్చి తుద కామె తొడమీదనే ఒరిగిపోయాడు. నా చేతిలోని కాగితం ఎప్పు డెగిరిందో గాలికెగిరి మంచంకోడుకు తగులుకొని రెపరెపలాడుతూ వుంది. అప్పటికి శాంతించింది పరిస్థితి. సూర్యుడు చురుకు తగ్గాడు. మురళి నా మనస్సులో మెదిలాడు.

మురళి ఓ చక్కని చిత్రకారుడు. చిత్రజగతిలో ఉన్నతుడు. ఈ జగతిలో మాత్రం మధ్యముడే! సామాన్య పరిస్థితులమధ్య అసమాన్యంగా నలుగుతున్నవాడే!—అయితే ఈ మధ్య తానేదో సంస్థలో సభ్యుడుగా చేరాడట! ఆ సంస్థ ధ్యేయం ప్రార్థన. తద్వారా ప్రశాంతి. అక్కడ చేరింది మొదలు అతడు హాయిగా వున్నాడట! అది ఎలా సాధ్యపడిందో తెలుసుకోవాలని కుతూహలం. అతనిని కలుసుకోవా లనిపించింది. నేను మురళి కోసం బయలుదేరుతుంటే శివుడు నాకోసం వచ్చాడు.

నేను ముందు, వాడు వెనుకగా బయలుదేరాము. వెంటపడి దూడలా

రావడమే తన పని అన్నట్లుగా వుంటుంది వాడు ప్రక్కన నడుస్తూంటే! అవసరముంటేకానీ నోరు కదపడు. కానీ ప్రతి చిన్న సంఘటనను నిశితంగా గమనిస్తూ వుంటాడు.

"మనమిప్పుడు మురళి దగ్గరికి వెళ్ళాలి."

శివుడు బదులు పలుకలేదు.

"ఎందుకని అడగవేం?"—బదులు రాదని తెలిసి కూడా నేనే అడిగాను.

"బొమ్మ గీయించుకోవడానికై వుంటుంది."

"కాదు."

"మరి?"

"ప్రశాంతికోసం!"

"అతను అమ్ముతాడా?"

"మనిషి సాధించవచ్చునని నమ్ముతాడు."

"ఆత్మవిశ్వాసముంటే మనిషి అన్నీ సాధించవచ్చు. దాని కతడే అవసరము లేదు." చాల నిర్లక్ష్యంగా వుంది జవాబు.

కూత దవ్వులో మురళి యిల్లు. మా మాటలు మావిగానే వుండగా మేము మురళి యింట్లో అడుగుబెట్టాము. అడుగు అటూ యిటు కదపకుండా నిలబడిపోయాను. శివుడు నా ప్రక్కనే వున్నాడు.

గీస్తూ గీస్తూ వదలిన చిత్రం తాలూకు బోర్డు అలా పడివుంది. రక రకాల కుంచెలు చిందరవందరగా పడి వున్నాయి. రంగులు కలుపుకొనే పింగాణీ ప్లేట్, సిరాబుడ్లు ఎక్కడివక్కడ పడివున్నాయి. స్టీల్ ఫ్రేములో ఓ క్యాబినెట్ సైజ్ ఫోటో ముందర వుంది. ఆ మహాత్ముడెవరో తెలియదు. రమణ మహర్షి ఛాయలు కనిపిస్తున్నాయి. పద్మాసనాసీనుడై మురళి ఆ బొమ్మ ముందు బొమ్మలా కూర్చున్నాడు. కనులు మూతలుపడి వున్నాయి. ఏకధారగా చెంపలమీదుగా కన్నీళ్లు స్రవిస్తున్నాయి. అవి ఆనందబాష్పాలో? దుఃఖాశ్రు

వులో తెలియదు! మా రాక అతని నిశ్చలతకు యే మాత్రం భంగం కలిగించలేకపోయింది. కాసేపు తదేకంగా అతనివైపు చూస్తూ నిలబడ్డాను.

బాహ్యస్మృతిని పూర్తిగా కోల్పోయి వున్నాడు మురళి. ఒక రకమైన తృప్తి—ఆ తృప్తినుండి పుట్టిన వెలుగు—అతని మొగంలో ప్రస్ఫుటంగా కనుపిస్తున్నాయి. అంతర్దృష్టితోనే ఏదో దర్శిస్తున్నట్లున్నాడు. ప్రార్థన ద్వారా అతడు సాధించిన యేకాగ్రతను, తద్వారా అనుభవిస్తున్న ప్రశాంతతను చూచి మనసు ఉప్పొంగింది. చేతులెత్తి నమస్కరిద్దామన్న తలంపు కలిగినా శివుడు ప్రక్క నుండగా ఆ పని చేయలేక పోయాను. మురళి ప్రశాంతతకు భంగం కలిగించడం యిష్టంలేకపోయింది. అయిష్టంగానే అక్కడినుండి తిరుగుముఖం పట్టాము.

శివుడూ నేను వీధిని పడ్డాము.

"చూశావా శివుడూ?—మురళి ప్రశాంతతను అమ్ముతున్నాడో? నమ్ముతున్నాడో?"

"అంతకంటే ఆత్మవంచన మరొక్కటి లేదు"—శివుడు ఈ మాట అనడానికి తడుముకోలేదు. తడబడలేదు.

"ఏమంటున్నావ్?"

"అనవలసిన మాటే అంటున్నాను."

"నువ్వు అనవలసిన మాటయినా, నేను వినవలసిన మాట గాదు" కటువుగా అన్నాను.

"గురువుగారూ!"

అబ్బ! ఎంత కాలానికి శివుడి నోట్లో ఈ మాట వెలువడింది. ఎంత హాయిగా వుంది?....అనుభూతిలో ఒడలు పులకరించి శివుణ్ణి చూస్తూ ఒక్క క్షణం నిలబడ్డాను. శివుడు నన్ను చూస్తూ నిలబడ్డాడు. చిరునవ్వు వాడి పెదవులమీద చిందులేస్తూ వుంది.

"చిత్ర లేఖనము, నటన, రచన, "ఆదిగా గల కళలు మనిషికి వర

ప్రసాదాలు. దైవ సృష్టిలో అవి యే కొందరికో పరిమితాలు. అందుకే వాళ్ళను కళాకారులంటున్నారు."

వాడు చెబుతున్నాడు. నేను వింటున్నాను.

"ప్రార్థన ఏకాగ్రతకు తద్వారా ప్రశాంతతకు సాధనమని మీ అభిప్రాయం. అవునా?"

"అవును."

"అయితే అశాంతికి నిలయమైన మీ యింట్లో ఏకాగ్రత లేకనే మీరు రచనా వ్యాసంగం చేస్తున్నారా? ఏకాగ్రత లేకనే మురళి చిత్రాలు గీయగలుగుతున్నాడా? ఇంకొక్కడు నటించగలుగుతున్నాడా?"

రెప్పవాల్చకుండా వింటూ ఆలోచిస్తున్నాను.

"ప్రార్థన ఏకాగ్రతకు సాధనమైతే కళారాధనలోనే ఏకాగ్రత యిమిడి వుంది. ఇక కళాకారులకు ప్రార్థన లెందుకు? ఆ సాకుతో అమూల్యమైన కాలాన్ని వృథా చేసే అధికారం కళాకారుడికి లేదు. చూడండి! మురళి బొమ్మ గీస్తున్నాడు. ఆ చిత్రం ఆత్మానందాన్ని కలిగించవచ్చు. విప్లవాన్ని రేకెత్తించవచ్చు. అదేవిధంగా ఒకరి రచన....మరొక్కరి నటనా!—అవి లోక కళ్యాణం కోసం. మరి లోకకళ్యాణాన్ని వదలిపెట్టి, చేస్తున్న పని అవతల పెట్టి ముక్కులు మూసుకొని కూర్చోవడం ఆత్మవంచన కాదంటారా?"

వాడి చిన్న బుఱ్ఱలోని వాడికి నా బుఱ్ఱ వేడెక్కింది.

"కళాకారులే కాదు. మడకపిడి పట్టి మన్ను దున్నేవాడైనా, కత్తి చేత బట్టి కట్టెలు కొట్టుకునేవాడైనా అంతే!....పనిలో లీన మవడమే ఏకాగ్రత. పనిని వదలి అదే పనిగా కాలయాపన చేయడం వృథా!....అది ఆత్మవంచన!"....

ఆలోచించవలసిన విషయమే! దీనినే కర్మయోగమంటారు కాబోలు.

శివుడి ఆలోచనల్ని నేను అనుసరిస్తున్నాను. వాడు నన్ననుస రిస్తున్నాడు. మేము ముందుకు వెళ్ళుతున్నాము!

రైల్వేస్టేషను దాటితే అటు ప్రక్కగా పెద్ద సత్రం. దేవస్థానంవారు కట్టించిన సత్రాలలో అది రెండవది. కాబట్టి దానిని రెండో సత్రమంటారు. కట్టిన కొత్తల్లో అక్కడ ఎక్కువ రద్దీ వుండేదిగాదు. అప్పుడా సత్రం మధ్య భాగాన ఓ చక్కని తోట వుండేది. కొత్త ఒక వింతగా ఆ తోటను చాల జాగ్రత్తగా కాపాడేవారు దేవస్థానంవారు. 'పార్కు'కు నోచుకోని తిరుపతి పాలిటికి ఆ తోట ఓ చక్కని ఉద్యానవనం. సాయం సమయాల్లో మేధావులకు, న్యాయవాదులకు, రాజకీయవాదాలకు నిలయం. ఇప్పుడా వాతావరణం లేకపోయినా, జనసందోహంతో నిండివున్నా, అలవాటుపడ్డ ప్రాణులు అక్కడే చేరుతుంటాయి. ఇప్పుడు ఊరిని, రెండో సత్రాన్ని కలుపుతూ ఎత్తువంతెన నొకటి నిర్మించారు. ఆ ఎత్తు వంతెన నెక్కి దిగితే రైల్వేస్టేషను మీదుగా రెండో సత్రములో పడవచ్చు. మా గమ్యమూ అదే!

ఊళ్లోవారిని రెండో సత్రానికి, రెండో సత్రములోని యాత్రీకులను ఊళ్లోకి చేరవేయడానికి ఎత్తు వంతెన దగ్గరి మార్గము. అడుక్కొని తినే అంధులకు, కామాంధులకు, పెద్ద రోగపీడితులకు, పెద్ద పెద్ద మనుష్యుల స్వార్థాల తాడితులకూ, ఆధారము. ఆ వంతెన మెట్లెక్కుతున్నాము.

నలుగురు నాలుగు దిక్కుల్లో కూర్చున్నారు మెట్లమీద ఓరగా: ఒకడి నోట్లో బీడీ, మరొకడి నోట్లో సిగరెట్టు మంచి రసపట్టులోవున్నాయి. ఆకారాల మాట వదలి ఆ తలల్ని పరిశీలిస్తే నాలుగు కాకి గూళ్ళను ఒక్క చోట వ్రేలాడగట్టినట్లుంది. తలల్ని వదలి ఆకారాల్ని చూస్తే కాలీకాలక నిలిచిన తొర్రమానుల్లా వున్నాయి. పులిమేక ఆడుతున్నారు. అడుక్కొన్న డబ్బులు ఆటకు రక్తి కట్టిస్తున్నాయి. వాళ్ళకూ బాహ్యస్మృతిలేదు.

మరొక్క మూల మూడు ముక్కలాట మహాజోరుగా సాగుతూ

వుంది. అక్కడి వాతావరణం దీనికి భిన్నంగా వుంది. బిచ్చగాళ్లే కాదు— కాస్త పచ్చంగా వున్నవాళ్ళూ అక్కడ నిలబడి వున్నారు.

తనకు రావలసిన 'ధర్మం' మరొక్కడు అడ్డం దూరి తన్నుకుపోతే, ఆ అధర్మంమీద ధర్మయుద్ధం కొనసాగుతూ వుంది యిద్దరి ముష్టివాళ్ళ మధ్య. ఒకడికి కాలు కుంటి. మరొక్కడికి చేయి మొండి. ధర్మయుద్ధంలో ప్రయోగింపబడుతున్న అస్త్రాల ధాటికి ఆదారిలో వెడుతున్న ఆడవాళ్ళు చెవులు మూసుకొంటున్నారు. మగవాళ్ళు మొగాలు చిట్లించుకొంటు న్నారు.

మరొక్క నికృష్టుడు ముష్టి మెతుకులు తినడానికి కష్టపడుతున్నాడు. వానికి సంక్రమించిన రోగం పేరు పెద్దరోగం. ఆ రోగం ఆకలితో అతని చేతివేళ్ళు తినివేస్తే—వేళ్ళు లేకుండా మిగిలిన అరచేత్తో ఆకలి బాపుకోవ డానికి యాతనపడుతున్నాడు.

మెట్లు దిగుతున్నాము అవతలివైపున!

ఈలాంటి రోగగ్రస్థులే! ఓ గుంపు చేరారు. ఆ గుంపులో పాట! అడుక్కొనేవాళ్ళు పాడే పాటాదు. అది వేలంపాట. ఏమిటా వేలం?— అంటే, వారం చీటీ అట!—అడుక్కొన్న డబ్బుతో వాళ్ళు ఓ వారంచీటీ నడుపుతున్నారు. ఎవరి పాట ఎక్కువయితే వాళ్ళకు చీటీ డబ్బు వస్తుంది. వాడు ఆ డబ్బుతోనే వడ్డీ వ్యాపారం చేస్తాడు వాళ్ళతోనే!—చిత్రంగా వుంది ఆ రోగగ్రస్థుల వడ్డీరోగం.

ఈ ప్రక్క మెట్లెక్కి ఆ ప్రక్క మెట్లు దిగేలోపుగా బ్రదుకుల్లో ఎన్ని ఎగుడు దిగుళ్ళు ఎదురైనాయి?—అందుకే 'ఏం బ్రదుకులో?' అన్నాను నిస్పృహతో!

"ఏం బతుకులా?....నిలుపునా నిలబెట్టి కాల్చవలసిన బ్రతుకులు!" కసిగా అన్నాడు శివుడు.

దిగువ మెట్టు మీద కాలు దిగువ మెట్టు మీదనే వుంది. ఎగువ

మెట్టుమీద వేసిన కాలు వేసినట్లే వుంది. అలానే నిలబడిపోయాను ఆశ్చర్యంతో!

"అవును. ఈలాంటి నికృష్టజీవులందర్నీ నిలబెట్టి కాల్చి చంపాలి సిందే! వీళ్ళవల్ల యేం లాభం?....భూమికి బరువు తప్పితే! ఏం? అలా భయపడుతున్నారు? తమవంటి కవులకు, రచయితలకు ఆ మీదట కవితా వస్తువు కొరవడుతుందనా?"

నా నోరు మూతపడింది.

"నీ మట్టుకు నువ్వెంత రాస్తున్నావు! వేదికమీద అవకాశాలు దొరికితే ఎంత చక్కగా ఉపన్యాసాలు దంచేస్తున్నావు? రాతలకు చేతలకు సామ్యం వుంటే—యిలాంటి తలరాతలకు చోటుంటుందా?" అని శివుడు నన్ను నిలదీసి అడిగినట్లుంది! 'ఆఁ ఊఁ!' అనకుండా ఆలోచిస్తూ నడుస్తున్నాను.

రెండో సత్రములో దీపాలు వెలిగాయి. యాత్రీకులు గుంపుగా చేరి ఒకచోట వండుకొంటూ, మరొకచోట గుంపుగా చేరి తింటూ, మరికొందరు ఆరుబయట అలానే సొమ్మసిల్లి పడి దొర్లుతూ, గజిబిజిగా వుంది వాతావరణం. ఒకనాటి తోట ఛాయలు నామమాత్రంగా మిగిలిన తోటలో కూర్చుని వున్నాము. కూర్చున్నామన్న మాటేగానీ కుదురుగా కూర్చోలేకపోతున్నాను. శివుడు పక్కలో బల్లెంలా వున్నాడు—మాట్లాడకుండా కూర్చున్నా! రాతకు చేతకు సామ్యం వుందని నిరూపించాలని మనసు తాపత్రయపడుతూ వుంది. ఎలాగని ఆలోచిస్తూ వుంది. అవకాశం రాకపోతుందా? అని మనస్సు తనంతట తాను సమాధాన పడుతూ వుంది. అయినా నెమ్మదిగా కూర్చొనలేక పోతున్నాను. అందుకే బయలుదేరాను. నాతో కలిసి శివుడు బయలుదేరాడు.

అదే ఎత్తు వంతెనమీదుగా తిరిగివస్తున్నాము. ఆ వంతెనమీద చెప్పుకోదగిన మార్పేమీ కనుపించలేదు. లేదంటే అక్కడ కూడా దీపాలు

వెలిగాయి. కొంతమంది పడుకోవడానికి దుమ్ము దులుపుతున్నారా వంతెన మీద. రైల్వేస్టేషనువైపునుండి గబ గబా మెట్లెక్కి వస్తున్నాడొక కుర్ర వాడు. పది పన్నెండేండ్ల వయసుంటుంది. తెల్లటి పంచె గోచీపెట్టి కట్టాడు. ఒంటిమీద జందెము....నొసట అందంగా బొట్టు....చేతిలో ఒక బుట్ట.... బుట్టలో వడలు....మురుకులు—చూడ ముచ్చటగా వున్నాడు. 'సార్! సార్! అని అరుస్తున్నాడు. ఆగాను. పరుగెత్తుకొని దగ్గరకు వచ్చాడు. గస పోస్తూ నిలబడ్డాడు. వింతగా వాడివైపు చూస్తూ నిలబడ్డాను.

"వడలు....మురుకులు—సార్!"

"కనబడుతున్నాయిగా!"

"ఫ్రెష్‌గా వున్నాయి సార్!"

"అయితే ఏం చెయ్యమంటావ్?"

"కొన్ని కొనుక్కోమంటాను సార్!"

"ఛీ ఛీ!"

"సార్!....సార్....! మేం బ్రాహ్మలం సార్. మా అమ్మ మడి గట్టుకొని చాలా శుభ్రంగా చేసింది సార్! అలా చూస్తారేం సార్?— అమ్మతోడు అబద్ధంగాదు సార్....రెండు కొనండి సార్!"

"ఛీఛీ! నీకు బుద్ధుందా! అలగాజనం మాదిరి దారి తిండ్లు తిన మంటావా? వద్దు పో!—"

బయలుదేరబోయాను. అడ్డం పడ్డాడు కుర్రాడు.

"సార్! మా నాన్న చచ్చిపొయ్యాడు. మా అమ్మ ఒక్కతే నలుగురి పిల్లల్ని సాకాలి సార్. నేనే పెద్దోడిని. మీ లాంటి వాళ్ళు మా లాంటి వాళ్ళకు సాయం చెయ్యాలి సార్!....చెయ్యకపోతే యింకెవరు చేస్తారు సార్!" బ్రతిమలాడుతున్నాడు.

"చూశావా శివుడూ!"

"చూస్తున్నాను."

"వ్రేలెడంత వెధవ! ఎంత చక్కగా చెబుతున్నాడు కథలు!"

"సార్; సార్! అమ్మతోడు—నే నబద్ధం ఆడడంలేదు సార్!"

"రేయ్. కథలు పలుకుతున్న వెధవాయ్! నీ చిలుక పలుకులకు మీ అమ్మతోడా?....వడలూ వద్దు, మురుకులూ వద్దు....వెళ్ళు" కసిరాను.

"ఒరే నాన్నా! కథలు చెప్పకూడదురా! రాయాలి. రాస్తే నిన్ను రచయిత అంటారు. గౌరవిస్తారు. ఇక సభలు....సన్మానాలూ వగైరా వగైరా! వద్దురా అంటే, అలా పీక్కుతింటా వెందుకు? తప్పుగదూ! వద్దంటూనే బుద్ధిగా వెళ్ళిపోతే మంచి కుర్రాడంటారు గురువుగారి లాంటి వాళ్ళు! ఊఁ!" శివుడి మాటల్లో వ్యంగ్యం తొంగిచూస్తున్నట్లుంది. ఎలా విరుచుక పడతాడో యేమో? అని వాడివైపు బిత్తరపడి చూస్తున్నాను.

"ఇంతకూ బుట్టలో ఏ మాత్రముంటాయి వడలూ, మురుకులూ?" శివుడడిగాడు.

"బుట్టలోనా సార్!....ఇదో సార్!....చెబుతాను సార్!.... నాలుగు....ఎనిమిది....పన్నెండు—ఆఁ! మొత్తం రెండు రూపాయల నలభై పైసల కున్నాయి సార్!"

"ఊఁ! యిలా యివ్వు!" గద్దించాడు శివుడు. రెండు రూపాయల నలభై పైసలు వాడి చేత బెట్టి బుట్టందుకున్నాడు శివుడు. నేను మ్రాన్పడి నిలబడిపోయాను. వాడు నావంక చూడడం లేదు. కనీసం నే నక్కడ వున్నట్లు కూడా వాడికి స్పృహ లేదు. తన పని తనదిగా ఆ వంతెనమీద వున్న నికృష్ట జీవులందరికి తల కొక్క మురుకు, వడవంతున పంచాడు. బుట్ట ఖాళీ అయింది. ఖాళీ బుట్టను ఆ కుర్రవాడి చేతికిచ్చాడు.

అప్పుడు చూడాలి ఆ కుర్రవాడి ఆనందం. అదరాబాదరా డబ్బులు పంచె కొనకొంగులో మూట కట్టుకొన్నాడు. బుట్టను అలా గాలిలో ఎగుర

వేసి పట్టుకొన్నాడు. నెత్తిన బోర్లించుకున్నాడు కిరీటంలా! నావంక ధీమాగా చూశాడు రాజులా! అటుపై పరుగందుకొన్నాడు ఆనందానికే కాళ్ళు చేతులు వచ్చినట్లుగా!

పరుగెత్తుతున్న కుర్రవాడిని చూశాను. ప్రక్కనున్న శివుణ్ణి చూశాను. వంచిన తల ఎత్తకుండా ఒక్కొక్క మెట్టుగా కిందికి దిగుతున్నాను.

"నమస్కారం సార్!"

తలెత్తి చూశాను. నెత్తిమీద పెట్టె పడకా....ఒక భుజాన సంచి, ఒకచేత క్యారియర్....మరోచేత ఓ చిన్న సూట్ కేస్——మోయలేక మోస్తూ వంతెన మెట్లెక్కుతున్నాడు హీరో కృష్ణ.

"మా అయ్యగారు ఊరెళ్ళుతున్నారు సార్! బండెక్కించాలి సార్!....సార్ సార్! నా ఏకపాత్రాభినయం...."

నన్ను చూచి ఆగాడు కృష్ణ. నవ్వుతూ అడుగుతున్నాడు కృష్ణ. ఆలోచిస్తూ అతనివైపు చూశాను.

కృష్ణ శ్రమను చిరునవ్వుతో స్వీకరిస్తున్నాడు. తానొక జవానని బాధపడడంలేదు. తాను చేస్తున్న పనిని చులకన దృష్టితో చూడడంలేదు. కళాత్మకంగానే చూస్తున్నాడు. అలానే చేస్తున్నాడు. అది అతనిలో ప్రత్యేకత. అంత కష్టంలో కూడా తాను కళారాధకుడుగా కర్తవ్యాన్ని మరువలేదు. అతడు ఒక్కొక్క మెట్టుగా పైకెక్కుతున్నాడు.

నేను ఒక్కొక్క మెట్టుగా కిందికి దిగాను. తిరిగి చూశాను. కృష్ణ ఒక్కొక్క మెట్టుగా పై కెక్కుతూనే వున్నాడు. శివుడు వంతెనమీదనే నిలబడి ఎటో చూస్తున్నాడు.

ఇది భిన్నత్వం!

ఈ భిన్నత్వంలో ఏకత్వ సాధించాలంటే శివుడి ఎత్తుకు ఎదగాలి!

'శివుడూ!' అని పిలిచాను ఎలుగెత్తి.

'గురువుగారూ!' అన్నాడు అంత ఎత్తున నిలబడి!

'గురువుగారు?'—ఈ మాట అనవలసింది నేనా? వాడా?

అనుకొన్నది వాడంటున్నాడు. అనవలసింది నేను అనలేక పోతున్నాను.

అనవలసింది అనడం, అనింది చేయడమే 'శివపూజ!'

అందుకే శివుడూ నేను స్నేహితులం! *